సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



పంటల రక్షణకు..

దెబ్బతిన్న పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు.

- 8లో ▸



రైతు బాంధవుడు..

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాంధవుడని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.9 /23.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కామారెడ్డి ఆర్ట్స్ కళాశాల అల్మనక్ విడుదల

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అల్మనక్(సమగ్ర సమాచారం)ను గురువారం ప్రిన్సిపాల్ కిష్టయ్య విడుదల చేశారు. కళాశాల బోధన, అంతర్గత పరీక్షలు, సెలవులు, సెమిస్టర్ పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తదితర వివరాలను ఇందులో పొందుపరిచినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమైనందున విద్యార్థులందరు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అకడమిక్ సమన్వయకర్త శంకర్, పరీక్షల నియంత్రణ అధికారి రామకృష్ణ, యూజీసీ సమన్వయకర్త గణేష్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి రామస్వామి, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సమన్వయకర్త రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు షురూ



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఆల్ ఇండియా కోటాలో మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన అంకంవార్ అంకిత హన్మంత్ అనే విద్యార్థిని కళాశాలలో తొలి సీటు పొందారు. ఆమె కాలేజీలో రిపోర్ట్ చేశారు. ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు సీట్ల కేటాయింపు మొదలు కానుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత తరగతులు ప్రారంభమవుతాయి.

'విద్యార్థులలో సామర్థ్యాలు పెరగాలి'



లింగంపేట: విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాజు సూచించారు. లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు సబ్జెక్ట్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించి రెండేళ్లవుతోందన్నారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యా బోధనకు పునరంకితం కావాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడుల్లో 5 వేల మంది కొత్త విద్యార్థులు చేరారన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల ప్రగతికి కృషి చేయాలని సూచించారు. అనంతరం కామారెడ్డి డీఈవోగా విధుల్లో చేరి ఐదేళ్లవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు ఆయనతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామస్వామి, జిల్లా సెక్టోరల్ అధికారి వెంకటరమణ, మండల నోడల్ అధికారి సాయన్న, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వహీద్ సిద్దిఖీ, డీఆర్పీలు రాజ్‌కుమార్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల దత్తత



భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు అనాథ పిల్లలను శిశు సంక్షేమ శాఖ అధికారులు గురువారం దత్తత తీసుకున్నారు. గ్రామానికి చెందిన శ్యామర్తి సత్తయ్య, బుజ్జి ఇటీవల మృతిచెందారు. దీంతో వీరి కుమారులు ఇద్దరూ అనాథలయ్యారు. ఈ విషయాన్ని ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, సర్పంచ్ స్వామి శిశు సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జిల్లా బాల సంరక్షణ అధికారి స్రవంతి గ్రామానికి వచ్చి ఇద్దరు పిల్లలను దత్తత తీసుకున్నారు. వీరిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని పేర్కొన్నారు. ఒక్కొక్కరి పేరున ప్రతి నెలా రూ. 4 వేలు డిపాజిట్ చేస్తుందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలల హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ద్యావర సాయిరెడ్డి, చిల్డ్రన్స్ ప్రొటెక్షన్ సోషల్ వర్కర్ వీణ, అంగన్‌వాడీ టీచర్ సుచరిత పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్!

ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఇటీవల దివ్యాంగుల పెన్షన్ పెంచిన సీఎం.. బీసీలు, మైనారిటీలకు రూ. లక్ష సాయం అందించే పథకాలు చేపట్టారు. మరికొందరికి దళితబంధు అమలు చేయడానికి కసరత్తు చేస్తున్న సర్కారు.. పంట రుణాల మాఫీకి చర్యలు చేపట్టింది. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పార్టీ కేడర్‌లో జోష్ తీసుకువస్తున్నాయి.



జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంక్షేమ పథకాలతో కొత్త ఊపు

- ఇప్పటికే దివ్యాంగుల పెన్షన్ పెంచిన ప్రభుత్వం
- బీసీలు, మైనారిటీలకు ఆర్థిక సాయం..
- త్వరలో మరికొందరికి దళితబంధు..
- రూ.లక్ష దాకా పంట రుణాల మాఫీ నిర్ణయంతో రైతులకు ఊరట
- ఊరూరా పాలాభిషేకాలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సాక్షి, కామారెడ్డి : ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తి, పెరిగిన వ్యతిరేకతను అధిగమించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు, పాత వాటిని పూర్తి చేయడానికి వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే దివ్యాంగుల ఫించన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016 కు పెంచింది. సర్కారు నిర్ణయంతో జిల్లాలో 19 వేల మంది దివ్యాంగులకు ప్రయోజనం కలిగింది.

గత ఎన్నికల సమయంలో రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. నాలుగేళ్లలో విడతలవారీగా కొందరి రుణాన్ని మాత్రమే మాఫీ చేసింది. ఇప్పటివరకు రూ.39 వేలలోపు రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. దీంతో మిగతా రైతుల్లో నిరాశ పెరిగిపోయింది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రుణమాఫీని పూర్తి చేయడానికి సర్కారు రెండు రోజుల క్రితం చర్యలు చేపట్టింది. దీంతో జిల్లాలో నలభై వేల మందికిపైగా రైతులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు.

రూ. లక్ష సాయం..

బీసీ కులాలకు చెందిన పలు కులవృత్తుల వారికి ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రూ.లక్ష సాయం అందిస్తోంది. ఈ పథకం ద్వారా ఒక్కో నియోజకవర్గంలో తొలుత మూడు వందల మందికి సాయం అందిస్తున్నారు. ఇప్పటికే కామారెడ్డి నియోజకవర్గంలో రూ.లక్ష సాయం పంపిణీ చేశారు. బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న ఆయా కులాలకు చెందిన చాలామందికి ప్రయోజనం కలిగింది. రేపో మాపో మైనారిటీలకు రూ.లక్ష సాయం పంపిణీ కార్యక్రమం మొదలుకానుంది.

దళితబంధు పథకం ద్వారా తొలి విడత పంపిణీ పూర్తయ్యింది. రెండో విడతలో ఒక్కో నియోజకవర్గంలో పదిహేను వందల మందికి చొప్పున సాయం అందించనున్నారు. సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయం అందించే పథకం కూడా త్వరలోనే కార్యరూపం దాల్చనుంది.

రెండో విడత గొర్రెల పంపిణీ...

గొల్ల, కురుమలకు ఒక్కో కుటుంబానికి 21 గొర్రెలను అందించే పథకం రెండో విడత మొదలైంది. ఇప్పటికే జిల్లా అధికారులు గొర్రెల కొనుగోలు కోసం ఇతర రాష్ట్రాలను చుట్టేస్తున్నారు. కొన్ని యూనిట్లకు సంబంధించిన గొర్రెలను తీసుకువచ్చి లబ్ధిదారులకు అందించారు. ఇంకా రావాల్సి ఉంది. మొదటి విడతలో సగం కుటుంబాలకు ప్రయోజనం కలిగింది. రెండో విడత యూనిట్ల కోసం గొర్రెలు దొరక్కపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపు ఎలాగోలా గొర్రెల యూనిట్ల గ్రౌండింగ్ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. గొర్రెల పంపిణీ ద్వారా గొల్ల, కురుమల మద్దతు దొరుకుతుందని బీఆర్ఎస్ శ్రేణులు ఆశిస్తున్నాయి.

లబ్ధిదారులు అండగా నిలుస్తారన్న ధీమా..

వచ్చే ఎన్నికల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమకు అండగా నిలుస్తారన్న ధీమా బీఆర్ఎస్ శ్రేణుల్లో కనిపిస్తోంది. మొన్నటిదాకా డీలా పడిన నేతలు, కార్యకర్తలు ఇటీవల కొంత యాక్టివ్‌గా మారారు. ప్రభుత్వం పథకాలను పూర్తి చేయడానికి కసరత్తు చేయడంతోపాటు కొత్త పథకాలను తెరపైకి తీసుకువస్తుండడంతో వారిలో ఉత్సాహం కనిపిస్తోంది. చాలాచోట్ల బీఆర్ఎస్ శ్రేణులకు ఆయా పథకాల లబ్ధి కూడా చేకూరుతోంది. దీంతో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా వెంటనే బీఆర్ఎస్ శ్రేణులు దాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. పంట రుణాల మాఫీ ప్రకటన చేయడంతోనే ఆ పార్టీ శ్రేణులు జిల్లా అంతటా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించాయి. వచ్చే ఎన్నికల్లో లబ్ధిదారులంతా అండగా నిలుస్తారని, తద్వారా మరోసారి అధికారం తమ పార్టీదేనన్న ధీమాతో ఉన్నారు.



సీఎంకు కృతజ్ఞతలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గురువారం సీఎం కేసీఆర్‌ను కలిశారు. పంట రుణాలు మాఫీ చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసినవారిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, బోధన్ ఎమ్మెల్యే షకీల్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఉన్నారు.

లక్కీడ్రాతో రిజర్వేషన్లు ఖరారు

కామారెడ్డి క్రైం: మద్యం దుకాణాలకు రిజర్వేషన్లు ఖరారు చేయడం కోసం గురువారం కలెక్టరేట్‌లో ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ త్రిసభ్య కమిటీ అధికారుల సమక్షంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ డ్రా తీశారు. జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉండగా.. గౌడ కులానికి 15 శాతం (7), ఎస్సీలకు 10 శాతం (5), ఎస్టీలకు 5 శాతం (2) మద్యం దుకాణాలను రిజర్వ్ చేశారు.

గౌడ కులస్తులకు కామారెడ్డి బల్దియా పరిధిలోని సిరిసిల్ల రోడ్‌లోగల 3వ నంబరు దుకాణంతో పాటు రామారెడ్డి, సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడి, లింగంపేట-1, బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని షాప్ నెంబర్-5, జుక్కల్-2, పిట్లం-1 వైన్‌షాప్‌లు కేటాయించారు. ఎస్సీలకు కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని హైదరాబాద్ రోడ్‌లోగల షాప్-1, భిక్కనూరు-2, మాచారెడ్డి మండలం యెల్పుగొండ దుకాణం, గాంధారి-1, నస్రుల్లాబాద్-1 మద్యం దుకాణాలు దక్కాయి. ఎస్టీలకు బాన్సువాడ బల్దియా పరిధిలోని షాప్ నెంబర్-1, గాంధారి-2 మద్యం దుకాణాలు రిజర్వ్ అయ్యాయి. లక్కీడ్రా కార్యక్రమంలో జిల్లా ఆబ్కారీ పర్యవేక్షకులు రవీందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా తీస్తున్న కలెక్టర్ పాటిల్

'ఆరోగ్యంగా ఉంటేనే లక్ష్యాలను చేరుకోగలం'

కామారెడ్డి టౌన్: ఆరోగ్యంగా ఉంటేనే చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోగలమని అదనపు కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని హనుమాన్ మందిర్ రోడ్‌లోగల జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 ఏళ్లలోపు ప్రతి ఒక్కరు నులి పురుగుల నివారణ కోసం మాత్రలను వేసుకోవాలని సూచించారు. జిల్లాలో 2,52,538 మందికి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నది లక్ష్యం కాగా.. తొలిరోజు 2,37,822 మందికి మాత్రలు వేశామని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. మొదటిరోజే 94.17 లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజు, ఏసీజీఈ నీల లింగం, వైద్య శాఖ సిబ్బంది వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి మాత్ర వేస్తున్న అదనపు కలెక్టర్

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం రోడ్డు భద్రత కమిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారులకు సమీపంలోని గ్రామాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై కళాజాతలు ఏర్పాటు చేయాలన్నారు. భారీ వర్షాలకు జాతీయ రహదారిపై అక్కడక్కడ ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే వాటి యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. పిట్లం, సదాశివనగర్, భిక్కనూరు ప్రాంతాలలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని ఒక గ్రామాన్ని ఎంచుకొని ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతలను జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పూడ్చి వేయిస్తామన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీటీవో వాణి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీస్, విద్య, వైద్య, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

తల్లిపాలు అమృతంతో సమానం

కామారెడ్డి క్రైం: తల్లిపాలు అమృతంతో సమానమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే పాలు పట్టించాలని సూచించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసవం అయిన వెంటనే వచ్చే ముర్రుపాలు బిడ్డలకు తాగిస్తే రోగ నిరోధక శక్తిని పెంచి, అనేక వ్యాధులు రాకుండా కాపాడతాయన్నారు. బిడ్డ పుట్టిన ఆరు మాసాల వరకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గర్భిణులు, తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలని ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై రూపొందించిన యానిమేటెడ్ చిత్రాలు, వీడియోలు, కరపత్రాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రమ్య, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, గిరిజన అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సీడీపీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పాటిల్

టీచర్ల కొరతతో అందని విద్య

ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

బాన్సువాడ: బీర్కూర్ మండలం బరంగెడ్గి ఉన్నత పాఠశాలలో తొమ్మిది తరగతులలో కలిపి 112 మంది విద్యార్థులున్నారు. ఏటా ఒక్కో తరగతి అప్‌గ్రేడ్ అవుతోంది. అయితే ఇక్కడ ఎనిమిది ఉపాధ్యాయ పోస్టులు ఉండగా.. ఏడుగురే ఉన్నారు. సాంఘిక శాస్త్రం బోధించాల్సిన టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. అన్వేష్ అనే ఉపాధ్యాయుడు దీర్ఘకాలిక సెలవులో ఉండగా.. సంతోష్ అనే ఉపాధ్యాయుడు నాలుగేళ్ల నుంచి డిప్యుటేషన్‌లో ఉన్నారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులు మండల కేంద్రంలో ఇస్తున్న శిక్షణకు వెళ్తున్నారు. దీంతో ముగ్గురు ఉపాధ్యాయులే అన్ని తరగతులకు బోధించాల్సిన పరిస్థితి ఉంది. ఉపాధ్యాయుల కొరతతో తమ పిల్లలకు సరిగా విద్యాబోధన జరగడం లేదని భావిస్తున్న తల్లిదండ్రులు వేరే పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో క్రమంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇటీవల నిర్వహించిన బడిబాటలో ఉపాధ్యాయులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లినప్పుడు ''మన ఊరి పాఠశాలలో సరిగ్గా ఉపాధ్యాయులే ఉండరు మేమెందుకు ఇక్కడికి పంపాలి'' అని ఎదురు ప్రశ్నించారు. ''టీచర్లు లేని బడికి పంపించి మా పిల్లల భవిష్యత్‌తో ఆటలాడలేం'' అని తెగేసి చెప్పినట్లు తెలిసింది. అంతేకాక తమ పాఠశాలనుంచి వేరే పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించిన టీచర్ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల పాఠశాల యాజమాన్య కమిటీ దీనిపై తీర్మానం చేసి అధికారులకు అందించడం చర్చనీయాంశమైంది. ఇది ఒక్క బరంగెడ్గి బడి పరిస్థితే కాదు.. జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. తమ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నా ఫలితం ఉండడం లేదు. దీంతో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదు. సర్కారు ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని విద్యాభిమానులు కోరుతున్నారు.



డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని తీర్మానం చేసిన బరంగెడ్గి ఎస్ఎంసీ కమిటీ

జిల్లాలోని పాఠశాలల్లో టీచర్ పోస్టుల వివరాలు..

ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	ఉపాధ్యాయ పోస్టులు	ఖాళీలు
656	124	182	4,014	924

సదాశివనగర్ వైస్ ఎంపీపీపై అవిశ్వాసం

సదాశివనగర్: సదాశివనగర్ వైస్‌ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డిపై గురువారం అవిశ్వాసం పెట్టారు. ఈ మేరకు ఎంపీపీ గైని అనసూయతో పాటు ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు గురువారం కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డికి నోటీసును అందజేశారు. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలున్నాయి. 11 చోట్ల అధికార పార్టీ సభ్యులు, ఒకచోట కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారు. సదాశివనగర్ ఎంపీటీసీ-1 స్థానం నుంచి గెలిచిన టీఆర్ఎస్ అభ్యర్థి గాదారి శ్రీనివాస్‌రెడ్డి వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. అనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో ఇటీవల ఆయన అధికార పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు.

దీంతో ఆయనపై అధికార పార్టీ సభ్యులు అవిశ్వాసం నోటీస్ ఇచ్చారు. నోటీస్ ఇచ్చినవారిలో ఎంపీపీ అనసూయతోపాటు ఎంపీటీసీ సభ్యులు బీరయ్య, లక్ష్మి, రేణుక, రాంచందర్‌రావు, జయశ్రీ, సుజాత, స్వరూప, భైరవరెడ్డి ఉన్నారు. వారివెంట సదాశివనగర్ జెడ్పీటీసీ నర్సింలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.



కామారెడ్డి ఆర్డీవోకు అవిశ్వాసం నోటీసును అందిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

క్లుప్తంగా

పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల రక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. నందివాడ శివారులో మొక్కజొన్న, పత్తి, సోయా పంటలను ఆమె గురువారం పరిశీలించారు. పంటల్లో అధిక నీటిని తొలగించాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత పత్తి పంటలో ఎకరానికి 20 కిలోల యూరియాను లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. సోయాబీన్ పంటలో తెగులు నివారణకు ఎకరానికి 300 గ్రాముల అసిఫేట్ లేదా 400 గ్రాముల అసితామప్రిడ్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీకాంత్, ఏఈవో రాకేష్, రైతులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాల తనిఖీ



బాన్సువాడ రూరల్: మండలంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గురువారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆర్‌ఎల్‌సీ బషీర్, విజిలెన్స్ అధికారులు అహ్మద్ జియా, హమీద్‌లు తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బియ్యం, వంట సరుకులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఆరు కిలోల కంతి తొలగింపు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం పోచాపూర్ గ్రామానికి చెందిన మహిళ కమల కడుపులో నుంచి ఆరు కిలోల కంతిని తొలగించినట్లు వైద్యులు నాగేశ్వర్‌రావు గురువారం తెలిపారు. కమల తరుచూ కడుపునొప్పితో బాధపడుతుండటంతో స్కానింగ్ చేసినట్లు ఆయన తెలిపారు. స్కానింగ్‌లో కడుపులో కంతి ఉన్నట్లు గుర్తించామని, ఆపరేషన్ చేసి తొలగించడంతో మహిళ ఆరోగ్యంగా ఉందన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారంలో పోలింగ్ కేంద్రాలను గురువారం ఎల్లారెడ్డి ఆర్డీవో రాథోడ్ రమేశ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో గల వసతులను స్థానిక తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మస్రూర్‌ను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల సంఖ్య, ఇతర వివరాలపై ఆయన ఆరా తీశారు. కార్యదర్శి సంతోష్, పాఠశాల హెచ్‌ఎం శివ కుమార్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

- ప్రభుత్వం నిషేధించినా అమలు కాని వైనం
- ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్ పెనుభూతం



ఎల్లారెడ్డి పట్టణంలో వినియోగించి పారేసిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, కప్పులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కేంద్ర ప్రభుత్వం ప్లాస్టిక్‌పై నిషేధం విధించి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు వాటి వినియోగం మాత్రం తగ్గడం లేదు. గతేడాది జులై 1 నుంచి ప్లాస్టిక్ వినియోగం చేయవద్దని ఆదేశాలు జారీ చేసినా కొద్ది రోజుల పాటు వినియోగం తగ్గినప్పటికి ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం మరింత పెరిగింది. ప్లాస్టిక్ వినియోగంతో రోగాల బారిన పడే అవకాశాలున్నప్పటికి వాటిని వినియోగించడంలో ప్రజలు కూడా తగ్గడం లేదు.

గతేడాది జూలై 1 నుంచి నిషేధం

ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో వాతావరణం కాలుష్యం అవుతుందని భావించిన కేంద్రం గత ఏడాది జులై 1 నుంచి 75 మైక్రాన్ల మందం కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు విక్రయించకుండా ఉండడంతో పాటు వాటిని వినియోగించొద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొద్ది నెలల పాటు ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు తగ్గడంతో పాటు, వినియోగం సైతం తగ్గిపోయింది. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణదారులపై అధికారులు దాడులు నిర్వహించి వాటిని సీజ్ చేయడంతో పాటు విక్రయించిన వారికి, ప్లాస్టిక్ వినియోగించిన వారికి మున్సిపల్, జీపీ అధికారులు జరిమానాలు విధించారు. దీంతో ప్లాస్టిక్ వినియోగానికి బదులు కాగితంతో తయారైన ప్లేట్లు, కప్పులు, గ్లాసుల వినియోగం పెరిగింది. ప్రజలు సైతం ప్లాస్టిక్ కవర్లు లభించకపోవడంతో ఇంటి నుంచి జూట్ బ్యాగులు లేదా ఇతర చేతి సంచులను తీసుకుని మార్కెట్‌కు వెళ్లారు. ఇదే విధానం కొనసాగాల్సి ఉండగా అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మళ్లీ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు, వినియోగాలు పూర్తిగా పెరిగి పోయాయని ప్రజలు అంటున్నారు. అధికారుల పర్యవేక్షణతో పాటు ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలను మూసి వేస్తే ఇబ్బందులు ఉండవని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. గత ఏడాదిలో దుకాణాలపై దాడులు చేసి జరిమానాలు విధించాం. ప్రజలకు ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని అవగాహన కల్పించాం. ప్రజలు ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్తున్న సమయంలో జూట్ బ్యాగులను తీసుకొని వెళ్లాలి.

– జగ్జీవన్, మున్సిపల్ కమిషనర్, ఎల్లారెడ్డి

స్కూలుకు పోయే దారే ఇది!

బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం అధ్వానంగా మారింది. పట్టణంలో నడిఒడ్డున ఉన్న పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు వెళ్లే దారులు కూడా ఇంత అధ్వానంగా ఉండవంటే నమ్మండి. కనీసం ప్రార్థన చేసేందుకు కూడా స్థలం సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు తరగతి గదుల్లోనే ప్రార్థనలు చేస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాల ప్రాంగణ దుస్థితిపై దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.



బాన్సువాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కబ్జాకు గురైన భూమి స్వాధీనం



భూమి వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు

లింగంపేట: మండలంలోని కొండాపూర్‌లో కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కొట్టాలు వేసుకోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ, పోలీస్ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 8లో కమ్మరి రాములుతో పాటు మరికొంత మంది 27 గుంటల భూమిని కబ్జా చేసుకొని పశువుల కొట్టాలు వేసుకున్నారు. గ్రామ పంచాయతీ భూమిని కబ్జా చేసినట్లు సర్పంచ్ కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి సదరు భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాజేశ్వర్, ఎస్సై ప్రభాకర్, ఆర్‌ఐ బాలయ్య, సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు వేయించాలి



నట్టల మందు వేస్తున్న అధికారులు

రుద్రూర్: పశువులకు నట్టల నివారణ మందు వేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి జగన్నాథచారి సూచించారు. కోటగిరి మండలం ఏక్లాస్‌పూర్‌లో గురువారం పశువులకు ఉచిత నట్టల నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. జీవాల పెంపకందారులు నట్టల నివారణ, గాలికుంటు వ్యాధినిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ గంగాధర్, జెడ్పీటీసీ శంకర్ పటేల్, వెటర్నరీ ఏడీ బాలిక్ అహ్మద్, బస్వారెడ్డి, మండల పశువైద్యాధికారి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

డిచ్‌పల్లి: తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియ సజావుగా జరిగేలా ఉపాధ్యాయులు బాధ్యత వహించి, నాణ్యతతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ సామర్థ్యాల సాధనలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల భాషోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డీఈవో తెలిపారు. గురువారం డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ శ్రీనివాస్‌రెడ్డి, సంధ్యారాణి శిక్షణ తరగతులపై సూచనలు ఇచ్చారు.

పేపర్ ఏజెంట్లను ఏకతాటిపైకి తీసుకొస్తాం



బాన్సువాడలో మాట్లాడుతున్న పేపర్ ఏజెంట్లు

బాన్సువాడ: కామారెడ్డి జిల్లాలో పని చేస్తున్న న్యూస్ పేపర్ల ఏజెంట్లను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోషియేషన్ నిజామాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తుకారం, జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం అన్నారు. గురువారం బాన్సువాడలో కామారెడ్డి జిల్లా పేపర్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ పట్టణ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, సభ్యులు శ్రీకాంత్, రవికుమార్, ఎంజే సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాప్‌లో దొంగతనం

బీబీపేట: బీబీపేటలోని మద్యం దుకాణంలో గురువారం తెల్లవారుజామున దొంగలు మద్యం బాటిళ్లు, నగదును ఎత్తుకెళ్లారు. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. కామారెడ్డికి చెందిన పైడి రాజేశ్వర్‌రెడ్డి మండల కేంద్రంలో మద్యం దుకాణం నడుపుతున్నాడు. తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు రూ. 21,600 విలువైన మద్యం బాటిళ్లు, రూ.5,500 నగదు ను ఎత్తుకెళ్లారు. అంతే కాకుండా తుజా ల్‌పూర్ లో గల మద్యం దుకాణంలో చోరీకి విఫల యత్నం చేశారు. రాజేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులపై వివక్ష తగదు



సమావేశమైన కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులపై వివక్ష తగదని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణ గుప్తా అన్నారు. గురువారం సౌత్ క్యాంపస్‌లో మాట్లాడుతూ.. 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేసి గతంలో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ యాలాద్రి, సునీత, నరసయ్య, రమాదేవి, సరిత, వైశాలి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ వెంటిలేటర్ అందజేత



కామారెడ్డి క్రైం: నేషనల్ హైవే అధికారులు ఆక్సిజన్ వెంటిలేటర్‌ను జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులకు గురువారం కలెక్టర్ చేతుల మీదుగా వితరణ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ అంబులెన్స్‌లో ఈ ఆక్సిజన్ వెంటిలేటర్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్లు శ్రీనివాసరావు, మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని వినతి

భిక్కనూరు: సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలంటూ గురువారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ విద్యార్థులు ప్రిన్సిపాల్ ఖాళీ కుర్చీకి వినతి పత్రాన్ని అందజేశారు. గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాల పరీక్షలు ఉన్నందున సెమిస్టర్ పరీక్షలు రెండు, నాలుగులను వాయిదా వేయాలని కోరుతూ విద్యార్థులు ప్రిన్సిపాల్ కార్యాలయానికి వచ్చారు. అక్కడ ప్రిన్సిపాల్ కవితా తురన్ రాలే దని తెలుసుకుని కుర్చీకి వినతి పత్రంను అందజేశారు. అలాగే రిజిస్ట్రార్‌కు కూడా పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ ఫ్యాక్స్ ద్వారా వినతి పత్రం పంపించారు.

క్రైం కార్నర్

రెచ్చిపోయిన దొంగలు

ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల చోరీలు



చిక్లీలో చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ పంచాయతీ పరిధిలోని ఇస్లాంపురా కాలనీలో బుధవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై మహేష్, బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బాసెట్టి సింహాద్రి తన భార్య, కొడుకుతో కలిసి ఇస్లాంపురాలో నివసిస్తున్నాడు. పది నెలల క్రితం సింహాద్రి బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. అతడి భార్య నందిని, కొడుకు (పిల్లాడు) మాత్రమే ఉంటున్నారు. బుధవారం రాత్రి ఆమె ఇంటికి తాళం వేసి ఓనర్ వాళ్ల ఇంట్లో నిద్రించింది. గురువారం ఉదయం లేచి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి అందులో ఉన్న మూడున్నర తులాల బంగారం, రూ.20వేలు నగదులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిందది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందల్వాయి కిరాణ దుకాణంలో..

ఇందల్వాయి: ఇందల్వాయిలోని ఓ కిరాణా దుకాణంలో గురువారం వేకువజామున దొంగతనం జరిగింది. గుణపంతో షట్టర్ తాళాలు ధ్వంసం చేసి షాపులోకి చొరబడ్డ దుండగుడు కౌంటర్లో ఉంచిన సుమారు రూ.6000 ఎత్తుకెళ్లాడు. దొంగతనం చేస్తున్న దృశ్యాలు సీసీ టీవీ కెమెరాలో నమోదయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

కొండూర్ శివాలయంలో..

సిరికొండ: మండలంలోని కొండూర్‌లో గల శివాలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో గల హుండీని ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్సై రమేశ్ పరిశీలించారు.

కిరాణ దుకాణంలో..

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గల మున్నూరు విజయకు చెందిన కిరాణ దుకాణంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు దుకాణం ముందు ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. దుకాణంలోకి చొరబడి సిగరెట్ డబ్బాలు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిక్లీలో ఆరు తులాల బంగారం..

మాక్లూర్: మండలంలోని చిక్లీలో బుధవారం రాత్రి ద్యాగ నీలకంఠం ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాలు.. నీలకంఠం బుధవారం ఉదయం కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఇంటికి తాళం ఉండటాన్ని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష 25 వేల నగదు, 30 తులాల వెండి ఎత్తుకెళ్లారు. దొంగతనం జరిగిన ఇంటిని ఎస్సై సుధీర్‌రావు పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

19.65 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న పీడీఎస్ బియ్యం



వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఉగ్రవాయి శివారులోని నల్లకుంట మైసమ్మ ప్రాంతంలో ఓ రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని గురువారం టాస్క్ ఫోర్స్ పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు నిర్వహించి బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య తెలిపారు. బ్రహ్మణపల్లి వెంకటరమణ, లింగంపేటకు చెందిన చింతల లక్ష్మీనారాయణ, వీరికి సహకరించిన భవానీపేట తండాకు చెందిన అజ్మీర్ రాము అలియాస్ సక్రియా, ఆర్‌బీనగర్‌కు చెందిన ఇబూది గణేష్, ఇందిరానగర్‌కు చెందిన షేక్ అక్బర్, భవానీపేట తండాకు చెందిన బానావత్ రవీందర్ 19.65 క్వింటాళ్ల బియ్యాన్ని రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని జంగంపల్లి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించినట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఘటన స్థలానికి దేవునిపల్లి ఎస్సై రాజు సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. దీంతో ఆందోళనకు గురైన పీడీఎస్ బియ్యం వ్యాపారులు తమ దుకాణాలు మూసి పరారయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 44వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ సమీపంలోని డపింగ్‌యార్డు వద్ద గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుందని ఒంటిపై బ్లూకలర్ టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయని ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు తెలిపారు.

చెరువులో పడి ఒకరు..

భిక్కనూరు: భిక్కనూరు కొత్త చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన జొర్రిగల బాల్‌నర్సయ్య (78) గురువారం వేకువజామున కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లి ప్రమాదశాత్తు చెరువులో పడి చనిపోయాడు.

విద్యుత్ షాక్‌తో ఆవు..

గాంధారి: మండలంలోని చద్మల్ తండాలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గురువారం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. తండాకు చెందిన రైతు మంజ గోపాల్ ఆవు మేతకు వెళ్లి షాక్‌తో మృతి చెందింది.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తి రిమాండ్

మాక్లూర్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.6 కోట్లకు టోకరా వేసిన మండలంలోని కొత్తపల్లికి చెందిన కడియాల రామకృష్ణను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. గాంధారి మండలం తిమ్మాపూర్‌కు చెందిన రమేష్ ఫిర్యాదు మేరకు రామకృష్ణపై కేసు అయిందన్నారు. నిందితుడిని పట్టుకోవటంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు చందు, శ్రీను, వెంకటస్వామిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ శివారులో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీసిద్ధరామేశ్వరనగర్‌కు చెందిన అరిగే సత్తయ్య, తన కుమారుడు దశరథ్‌తో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై రామాయంపేటకు వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా రామాయంపేట ఆస్పత్రికి తరలించారు.

ఇంటి స్థలం కబ్జాపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన సత్యనారాయణకు తన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సత్యనారాయణకు 77 గజాల ఇంటి స్థలం ఉంది. దాని పక్కనే ఉన్న కమలామ్మ వారి కుటుంబసభ్యులు ఉన్నారు. ఈ ఇంటి స్థలంలో నాగవిగ్రహాలు పెట్టినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాములబస్తీకి చెందిన గోక్ తాక్‌పై ఆదర్శనగర్‌కు చెందిన శుభమ్ దాడి చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జూలై 30న తన చెంపపై కొట్టినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కడియంతో దాడి..

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ ఠాణా పరిధిలోని ఆదర్శనగర్‌లోని శ్రీసాయి రెసిడెన్సీ వద్ద రిషబ్‌సింగ్‌పై బన్నిసింగ్ అనే వ్యక్తి దాడి చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కడియంతో దాడి చేయడంతో కంటి వద్ద గాయాలైనట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు

కామారెడ్డి క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సదాశివనగర్ మండలం వజ్జెపల్లి తండాకు చెందిన మాలోత్ రాజు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని గురువారం కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

దొంగిలించిన బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

నవీపేట: రైస్‌మిల్లులో దొంగిలించిన బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా నవీపేటలో పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. నిజామాబాద్ మండలం పాల్దా శివారులోని రైస్‌మిల్లులో బియ్యం బస్తాలను దొంగిలించారని యజమాని విశ్వనాథ్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెంజల్ క్రాసింగ్‌వద్ద వాహనాలను తనిఖీ చేయగా బియ్యం బస్తాలతో వెళ్తున్న ఆటోను పట్టుకున్నామన్నారు. ఆటోలో 10 బియ్యం బస్తాలను కనిపించడంతో అందులోని వ్యక్తులకు విచారించామన్నారు. రైస్‌మిల్లులో దొంగించినట్లు చెప్పడంతో ఆటోను సీజ్ చేసి, అందులో ఉన్న నిజామాబాద్‌కు చెందిన సయ్యద్ అమీర్, షేక్‌గౌస్, అమీర్‌ఖాన్, అస్లామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడి ఆత్మహత్య



హరిబాబు (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన మామిడి హరిబాబు (27) బుధవారం సాయంత్రం తన పొలం వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి తన చిన్నాన్న కుమారుడైన దుర్గ శైలంనకు తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో పంపాడు. అందులో తన ఆత్మహత్యకు గ్రామానికి చెందిన మంద నవీన్, తన అత్త మెదక్ జిల్లా అక్కన్నపేటకు చెందిన పిట్ల లక్ష్మి, తన భార్య నవనీత కారణమని వీడియో పేర్కొన్నాడు. వీడియో చూసిన శైలం విషయాన్ని హరిబాబు కుటుంబీకులకు చెప్పాడు. వారు పొలం వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఉన్న చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధుడు..

భిక్కనూరు: మండలంలోని భాగిర్తిపల్లిలో కడుపు నొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన గొంద్రు చిన్న నారాయణ (65) రెండేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూపెట్టుకున్నా నయం కాలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మైసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

గ్రామంలో విషాదఛాయలు

భాగిర్తిపల్లిలో ఒకే రోజు ఇద్దరి అంత్యక్రియలు జరగడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన హరిబాబు, నారాయణ అంత్యక్రియలు గురువారం సాయంత్రం గ్రామంలో నిర్వహించారు.